ANN తెలుగు

Follow: @ANNTELUGU

07-08-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 215 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## జగన్ అండ్ కోను కంట్రోల్ చేయడానికి రెండు నిమిషాలు చాలు

- స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.
- మంత్రులకు కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం.

02




## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

భూ బదిలీలు, ట్విన్ టవర్స్, పీపీపీ పాలసీకి ఆమోదం.

02







# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- భూ బదిలీలు, ట్విన్ టవర్స్, పీపీపీ పాలసీకి ఆమోదం.

**అమరావతి, మహా :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు.ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు బదిలీ చేసేందుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. అలాగే తిమ్మసముద్రంలో 13.45 ఎకరాల భూమిని రాజధాని పట్టణాభివృద్ధి సంస్థ కు బదిలీ చేయడానికి కూడా ఆమోదం తెలిపిందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థల పునర్వ్యవస్థీకరణ చేపడుతూ యూడీఏల సంఖ్యను 21 నుంచి 23కు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చేలా కండలేరు నుంచి ఇండస్ట్రియల్ క్లస్టర్‌కు నీటి సరఫరా ప్రతిపాదనకూ ఆమోదం లభించిందని చెప్పారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసుల యూడీఎస్ హక్కులను క్రమబద్ధీకరించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని, 400 హౌసింగ్ యూనిట్లకు సంబంధించిన భూ సమస్యకు కూడా పరిష్కారం చూపినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా ప్రతిష్ఠాత్మక 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లను మంత్రివర్గం ఆమోదించిందని, ఎత్తైన నిర్మాణంగా దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అమరావతిలో 47 అంతస్తులతో ట్విన్ టవర్స్ నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ టవర్స్‌లో కార్పొరేట్ సంస్థలు, క్వాంటమ్ టెక్నాలజీ సంస్థలకు కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. హైకోర్టు భవన రీడిజైన్ ప్రతిపాదనకూ గ్రీన్‌సిగ్నల్ లభించిందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం లక్ష్యంగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా ఆమ్నిబస్ చట్టం2026ను తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నిబంధనలను తొలగించి పారిశ్రామిక వృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అలాగే ఏపీ పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పాలసీ2026కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, పీపీపీ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించడమే కొత్త పాలసీ లక్ష్యమని స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం భూసేకరణలో డిఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల ప్రత్యేక పరిహారం చెల్లించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అలాగే మోతడక ప్రాంతంలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్టు, ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూముల సమీకరణకు కూడా మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

# జొన్న రైతుల ఖాతాల్లోకి రూ.994 కోట్లు.

- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు.
- దేశానికే తెలంగాణ ఆదర్శం.
- వెల్లడించిన మంత్రి తుమ్మల!

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ.994 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, ఇతర పంటల కొనుగోలు విధానం ఎంతో పారదర్శకంగా, వేగవంతంగా సాగుతోందని.. ఈ పనితీరు మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.అలాగే రాష్ట్రంలో ఎరువుల పంపిణీ వ్యవస్థను డిజిటలైజ్ చేస్తూ తీర్చిదిద్దిన 'తెలంగాణ ఎరువుల యాప్' సాధించిన విజయంపై మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్ ప్రమాణాలు, పనితీరును ప్రామాణికంగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం కూడా స్ఫూర్తి పొందిందని, అందుకనుగుణంగానే 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఎఫ్ఎఫ్ఎస్) వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేలా రూపొందించిన ఈ నూతన పంపిణీ విధానాన్ని నేటి నుంచి రాష్ట్రంలోని మరొక 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వ్యవసాయ రంగంలో కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, అధిక లాభాలనిచ్చే వాణిజ్య పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అత్యవసరత ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, సాంకేతిక పరిజ్ఞానం, అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించాలని సూచించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని ఆయిల్ పామ్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించేలా నిర్వహించిన 'హ్యాండ్లూమ్ హ్యాకథాన్' విజేతలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల సాంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక డిజిటల్ సాంకేతికత తోడైతే అంతర్జాతీయ మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతల పరుగు.

- అధిష్టానం అత్యవసర పిలుపు వెనుక వ్యూహమేంటి?
- మారుతున్న రాజకీయ సమీకరణాలు.
- హస్తినలో కమలనాథుల కీలక మథనం.

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి కేంద్ర అధిష్టానం నుంచి అత్యవసర పిలుపు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు, అంతర్గత పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ పెద్దలు ఏకంగా రాష్ట్ర ముఖ్య నేతలందరినీ హుటాహుటిన హస్తినకు రావాలని ఆదేశించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా అందిన ఈ పిలుపుతో కమలనాథులు తమ తదుపరి రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.అధిష్టానం నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక ప్రజా ప్రతినిధులు తెల్లవారుజామునే ప్రత్యేకంగా ఢిల్లీకి పయనం కానున్నారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిమిత్తం రాష్ట్రానికి చెందిన బీజేపీ పార్లమెంటు సభ్యులు ఢిల్లీలోనే మకాం వేసిన విషయం తెలిసిందే. వీరంతా కలిసి రేపు మధ్యాహ్నం సరిగ్గా 3 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో జరగనున్న అత్యంత కీలకమైన ఉన్నతస్థాయి భేటీలో పాల్గొననున్నారు. రాష్ట్ర పార్టీ భవిష్యత్తు కార్యాచరణను, దూకుడును ఈ సమావేశమే నిర్దేశించబోతోందని తెలుస్తుంది.ఈ అత్యున్నత స్థాయి సమావేశానికి ముందే ఢిల్లీ వేదికగా పక్కాగా గ్రౌండ్ వర్క్ పూర్తయినట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ ఇవాళ ఇప్పటికే నితిన్ నబీన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ తాజా పరిస్థితి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలపై ఆయన అధిష్టానానికి ఒక సమగ్రమైన, వాస్తవిక నివేదికను సమర్పించినట్లు సమాచారం. ఈ సుదీర్ఘ నివేదికలో పొందుపరిచిన అంశాల ఆధారంగానే రేపటి భేటీలో రాష్ట్ర నేతలకు జాతీయ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు స్పష్టమవుతోంది.

ఈ ఆకస్మిక సమావేశం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధానంగా తెలంగాణలో ఇటీవల చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలు, అధికార పార్టీకి ధీటుగా ప్రజా సమస్యలపై పోరాడటంలో అనుసరించాల్సిన సరికొత్త వ్యూహాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. దీనికి తోడు, రాష్ట్ర నాయకుల మధ్య ఎంతో కొంత సమన్వయ లోపం ఉందన్న వార్తలు అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య ఉన్న చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి, సమష్టిగా ఎలా ముందుకు సాగాలి, క్యాడర్‌లో ఎలా ఉత్సాహం నింపాలి అనే దానిపై కేంద్ర పెద్దలు కీలక సూచనలు చేయనున్నారు. అలాగే, ఇటీవల హైకమాండ్ జారీ చేసిన కీలక ఆదేశాల అమలు తీరుపై కూడా రేపటి సమావేశంలో ఆసాంతం సమీక్షించనున్నారు.మొత్తానికి, భవిష్యత్ రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా మరింత బలోపేతం కావడానికి తెలంగాణ బీజేపీని సమాయత్తం చేసే దిశగానే ఢిల్లీ పెద్దలు ఈ వ్యూహాత్మక భేటీకి రూపకల్పన చేసినట్లు అర్థమవుతోంది.

## జగన్ అండ్ కోను కంట్రోల్ చేయడానికి

# రెండు నిమిషాలు చాలు

- స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.
- మంత్రులకు కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం.



**అమరావతి, మహా** :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మూడున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలు, చట్టవ్యవస్థ, సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు, "జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి నాకు రెండు నిమిషాలు చాలు. కానీ రాజకీయాల ముసుగులో నేరాలకు పాల్పడుతున్నందున చట్టబద్ధంగానే వ్యవహరిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదని, ప్రభుత్వం ఇప్పటికే అన్ని అంశాలను ప్రజలకు వివరించిందని చెప్పారు. రిజర్వేషన్లపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత మంత్రులదేనని సూచించారు.

ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీరు అందిస్తామని సీఎం ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సరఫరా కొనసాగిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు సూచించారు. ఇటీవల ప్రారంభమైన భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలికిందని, ఆ ప్రారంభోత్సవంలో గిరిజన థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు దక్కడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. స్వర్ణాంధ్ర-వికసిత్ భారత్ లక్ష్యాలను స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో విస్తృతంగా ప్రస్తావించాలని సూచించారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టును వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తామని వెల్లడించారు.'దిశా' చట్టం అసలు అమల్లోకి రాలేదని, కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినప్పటికీ గత ప్రభుత్వం దానిపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. దిశా పోలీస్ స్టేషన్లు, వాహనాల పేరుతో హడావుడి చేశారని విమర్శించారు.

దేవరపల్లి పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు రైతుల పొలాలను ధ్వంసం చేశారని, చిరు వ్యాపారుల జీవనోపాధికి నష్టం కలిగించారని, దేవతల చిత్రాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. రైతులు తమ పంటలు నాశనమయ్యాయని తనకు సందేశాలు పంపారని పేర్కొన్నారు. జగన్ పర్యటనలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

రాజకీయ పార్టీల ముసుగులో నేరగాళ్లు తయారవుతున్నారని, ప్రశాంత జిల్లాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు రైతులు, ఆక్వా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు సూచించారు. ఆక్వా రంగానికి రూ.1,100 కోట్ల విద్యుత్ రాయితీలు అందించామని, ఆక్వా ఫీడ్ ఎగుమతులపై సుంకాలను 50 శాతం తగ్గించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఈ నెల 13న అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని తెలిపారు. అదే రోజు ఎమ్మెల్యే క్వార్టర్లను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, విజయదశమి నాటికి మంత్రుల నివాసాలను సిద్ధం చేస్తామని చెప్పారు.కేబినెట్ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపైనా విస్తృతంగా చర్చ జరిగింది. 11 రాష్ట్రాలకు చెందిన బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కేబినెట్ ఉపసంఘాన్ని ఆదేశించారు. భూముల వేలంలో సరైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలించాలని సూచించారు. పదిహేనేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులందరికీ సముచిత పరిష్కారం లభించేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

# ఒకే గొడుగు కిందికిరోడ్ల అభివృద్ధి

- ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు.



**హైదరాబాద్, మహా :** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించే దిశగా హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో రోడ్ల నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో ఆయన రోడ్ల విస్తరణ, పనుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రోడ్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన భూసేకరణ, నిధుల సమీకరణ, నిర్వహణ వంటి అంశాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను ఒకే గొడుగు కిందికి తేవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్వహణ సరిగా లేకపోవడం, ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ఓఆర్ఆర్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో రేడియల్ రోడ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు ప్రారంభించిన రేడియల్ రోడ్డు 1 పనులను డిసెంబర్ 9వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. రోడ్ల నిర్మాణంలో ఎదురయ్యే అడ్డంకులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రోడ్లకు ఇరువైపులా విధిగా పచ్చదనం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణంతో పాటు బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.హైదరాబాద్ మహానగర భవిష్యత్తు పూర్తిగా రోడ్ల విస్తరణ, అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎటువంటి అలసత్వం లేకుండా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ కోసం జరిపే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయం ఏమాత్రం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ చేసే ప్రక్రియను మరింత పారదర్శకంగా చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# జెన్ జీని గుడ్డిగా నమ్ముతా

- నిరసన వారి ప్రజాస్వామ్య హక్కు.
- విద్యకు జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు త్వరలోనే సాధ్యం!
- ఐఐఎమ్‌యుఎన్ వార్షికోత్సవంలో ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఆసక్తికర వ్యాఖ్యలు.




**ముంబయి, మహా :** విద్యా వ్యవస్థలో సంస్కరణలు, యువత ఆలోచనా ధోరణి, ప్రజాస్వామ్య హక్కులు సహా పలు అంతర్జాతీయ, సామాజిక అంశాలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. ముంబయి వేదికగా నిర్వహించిన ఐఐఎమ్‌యుఎన్ 15వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా రంగానికి జీడీపీలో 6 శాతం నిధుల కేటాయింపు అతిత్వరలోనే సాధ్యమవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసిన ఆయన.. నేటి 'జెన్ జీ' విద్యార్థులకు నిరసన తెలిపే పూర్తి ప్రజాస్వామ్య హక్కు ఉందని స్పష్టం చేశారు. సమస్యలను ప్రశ్నించడం, మార్పును ఆకాంక్షించడం నేటి తరం నైజమని, అంతమాత్రాన వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ఎంతమాత్రం సరికాదని తేల్చిచెప్పారు.విద్యా రంగాన్ని ఒక ఖర్చులా కాకుండా, దేశ భవిష్యత్తు కోసం చేసే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడిగా చూడాలని భాగవత్ పిలుపునిచ్చారు. చదువు వ్యాపారంగా మారకూడదని, సమాజంలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, మొత్తం సమాజం కూడా ఇందులో భాగస్వామ్యం వహించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విద్య కోసం బడ్జెట్‌లో సుమారు రూ. 1.3 లక్షల కోట్లు (2.5 నుంచి 2.6 శాతం) వెచ్చిస్తోందని, కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి వ్యయం జీడీపీలో 4.1 శాతంగా ఉందన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ2020) నిర్దేశించిన 6 శాతం లక్ష్యం త్వరలోనే నెరవేరుతుందన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణతో పాటు విద్యా వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దేశంలో విద్యార్థుల ఆందోళనలు, నిరసనలపై స్పందిస్తూ.. తాను జెన్ జీ తరాన్ని గుడ్డిగా నమ్ముతానని భాగవత్ వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన కూడా చర్చలు, సంప్రదింపుల్లో ఒక ముఖ్యమైన భాగమేనని చెప్పారు. నిరసనలు వ్యవస్థను మెరుగుపరచడానికే తప్ప దేశానికి వ్యతిరేకంగా కాదని అందరూ గ్రహించాలన్నారు. గతంలో తమ తరం పెద్దలు చెప్పిన ప్రతి విషయాన్ని ప్రశ్నించకుండా అంగీకరించేదని, కానీ నేటి జెన్ జీ, జెన్ ఆల్ఫా తరాలు ప్రశ్నలు వేస్తూ తార్కికమైన సమాధానాలను ఆశిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. యువతలోని ఈ జిజ్ఞాసను ప్రేమతో, సహనంతో నివృత్తి చేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే సమస్య పరిష్కారాలకు మార్గం చూపుతోందని గుర్తుచేశారు. సోషల్ మీడియాను నిషేధించడం పరిష్కారం కాదని, దానిని బాధ్యతాయుతంగా ఉపయోగించడం నేర్చుకోవాలని సూచించారు.

దేశ భద్రత, విదేశాంగ విధానంపైన కూడా ఆర్ఎస్ఎస్ చీఫ్ తనదైన శైలిలో మాట్లాడారు. పాకిస్థాన్, చైనాలతో విభేదాలు ఉన్నప్పటికీ, శాశ్వత శత్రుత్వం దేనికీ పరిష్కారం కాదని స్పష్టం చేశారు. విభేదాలను పక్కనపెట్టి వ్యవహరించడమే భారత్ అనుసరించే సనాతన విధానమని, మానవత్వమే అత్యున్నతమైనదని అన్నారు. పాకిస్థానీలందరూ మనకు శత్రువులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. అలాగే ఎల్జీబీటీక్యూ వర్గం కూడా మన సమాజంలో భాగమేనని, అందరికీ స్థానం కల్పించే సుదీర్ఘ సంప్రదాయం భారతదేశానికి ఉందన్నారు. అయితే స్వలింగ వివాహాలకు మాత్రం తన మద్దతు ఉండదని స్పష్టం చేశారు. దేశంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు గణనీయంగా పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, పొగాకు వంటి క్యాన్సర్ కారకాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.



చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి

# నేతన్నలకు అండగా నిలవండి

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు**

**ఢిల్లీ, మహా:** 'జాతీయ చేనేత దినోత్సవం' సందర్భంగా దేశ ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 1905 ఆగస్టు 7వ తేదీన దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 'స్వదేశీ ఉద్యమం' ప్రారంభమైందని, ఈ చారిత్రక ఘట్టాన్ని మనం ఎప్పటికీ మరువకూడదని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో ప్రారంభమైన ఈ ఉద్యమమే నేటి 'ఆత్మనిర్భర్ భారత్' (స్వావలంబన భారత) దార్శనికతకు పునాది వేసిందని ఆయన స్పష్టం చేశారు. అప్పట్లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా దేశవాసులంతా ఏకమై పెద్ద పోరాటమే చేశారని ప్రధాని పేర్కొన్నారు.

గత వారం దేశ ప్రజలందరూ 'ఫ్రెండ్‌షిప్ డే' (స్నేహితుల దినోత్సవం) ఎంత ఉత్సాహంగా జరుపుకున్నారో, అదే తరహా ఉత్సాహంతో ఆగస్టు 7న 'జాతీయ చేనేత దినోత్సవం' కూడా జరుపుకోవాలని ప్రధాని కోరారు. చేనేత దినోత్సవం జరుపుకోవడం అంటే ప్రతి పేద నేతన్న కుటుంబానికి అండగా నిలవడమేనని ఆయన వివరించారు. తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి మగ్గాలపై నేత కార్మికులు ఎంతో శ్రమించి, తమ చేతులతో అద్భుతమైన వస్త్రాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. మార్కెట్లో విభిన్న రకాల చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఆదరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా యువతకు , సోషల్ మీడియా వినియోగదారులకు ప్రధాని ఒక ప్రత్యేక సూచన చేశారు. ప్రజలు చేనేత వస్త్రాలను ధరించి 'గెట్ రెడీ విత్ మీ' వంటి వీడియోలు రూపొందించి, వాటిని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించారు. దేశంలోని పేద చేనేత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వావలంబన భారత్‌ను నిర్మించడమే మన లక్ష్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేసి, దానికి సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం ద్వారా మన నేతన్నల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్యవర్గాన్ని ప్రకటించిన కాక్రోచ్ జనతా పార్టీ

**ఢిల్లీ, మహా:** నిరుద్యోగుల గొంతుకగా తనను తాను అభివర్ణించుకుంటున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) తమ సంస్థాగత నిర్మాణం మరియు జాతీయ విస్తరణ ప్రణాళికలో భాగంగా తొలి జాతీయ నాయకత్వ జాబితాను అధికారికంగా విడుదల చేసింది. ఛత్రపతి శంభాజీనగర్ వేదికగా నిర్వహించిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ కమిటీ ఈ నూతన నాయకత్వ రోస్టర్‌ను ఆమోదించింది. ఈ కొత్త నాయకత్వ నిర్మాణంలో యువతకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ కీలక రంగాలు , మండలాలకు నూతన బాధ్యులను ఖరారు చేశారు.

ఈ నూతన కార్యవర్గం ప్రకారం, కాక్రోచ్ జనతా పార్టీ స్థాపకుడు మరియు జాతీయ కన్వీనర్‌గా 30 ఏళ్ల అభిజీత్ దిప్కే బాధ్యతలు చేపట్టగా, సహ కన్వీనర్లుగా 30 ఏళ్ల అశుతోష్ రాంకా, 27 ఏళ్ల సౌరవ్ దాస్ నియమితులయ్యారు. జాతీయ సంస్థాగత ఇన్‌ఛార్జ్‌గా 35 ఏళ్ల అజింక్యా షిండేను, సంస్థాగత కోఇన్‌ఛార్జ్‌గా 26 ఏళ్ల దీపక్ బలియాన్‌ను ఎంపిక చేశారు. ఇక జాతీయ కార్యదర్శిగా 34 ఏళ్ల ఆఫ్రీన్ నవాజ్, మీడియా లీడ్‌గా 30 ఏళ్ల విజయ్ రెడ్డి మల్లాంగి, లీగల్ అఫైర్స్ లీడ్‌గా 31 ఏళ్ల రత్నా సింగ్, రీసెర్చ్ అండ్ పాలసీ లీడ్‌గా 29 ఏళ్ల వైష్ణవి గౌర్, టెక్నాలజీ లీడ్‌గా 31 ఏళ్ల రోహన్ దేశ్‌పాండే, ఫైనాన్స్ లీడ్‌గా 33 ఏళ్ల యోగేష్ ఇంగలే బాధ్యతలు స్వీకరించారు.జాతీయ విస్తరణ ప్రణాళికను వేగవంతం చేసే దిశగా నాలుగు ప్రధాన మండలాలకు (జోన్లకు) ప్రత్యేక నాయకత్వాన్ని సిజెపి ఖరారు చేసింది. ఉత్తర మండలానికి దీపక్ బలియాన్, దక్షిణ మండలానికి విజయ్ రెడ్డి మల్లాంగి, తూర్పు మరియు ఈశాన్య మండలాల సమన్వయానికి 35 ఏళ్ల అంకిత్ భరద్వాజ్, పశ్చిమ మండలానికి యోగేష్ ఇంగలే జోనల్ లీడర్లుగా వ్యవహరించనున్నారు.రాబోయే ఆరు నెలల కాలంలో దేశవ్యాప్తంగా రాష్ట్ర సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు లోక్‌సభ, నగర స్థాయిలలో ప్రత్యేక సమన్వయ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ ప్రతినిధులు వెల్లడించారు



## చెరువుల్లోకి శుద్ధి జలాలే లక్ష్యం

**తక్కువ ఖర్చుతో నీటి శుద్ధికి కొత్త సాంకేతికతపై హైడ్రా అధ్యయనం.**

**హైదరాబాద్, మహా.** నగరంలోని చెరువుల పునరుద్ధరణలో మరో ముందడుగు వేస్తూ, శుద్ధి చేసిన జలాలను చెరువుల్లోకి మళ్లించే విధానాలపై హైడ్రా దృష్టి సారించింది. చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా ఇప్పటికే ఇన్‌లెట్ల అభివృద్ధి చేపట్టిన హైడ్రా.. ఇప్పుడు తక్కువ వ్యయంతో నీటిని శుద్ధి చేసే ఆధునిక సాంకేతికతలను పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో బిట్స్ పిలానీ- కేకే బిర్లా గోవా క్యాంపస్ అభివృద్ధి చేసిన వర్టికల్ ఫ్లో కన్స్ట్రక్టెడ్ వెట్‌ల్యాండ్ టెక్నాలజీ' పై హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధ్యయనం చేశారు. బిట్స్ పిలానీ ఆహ్వానం మేరకు గురువారం గోవా వెళ్లిన ఆయన, స్థిరమైన మురుగునీటి నిర్వహణ, పట్టణ సరస్సుల పునరుద్ధరణకు సంబంధించిన పలు సాంకేతిక విధానాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా ఎస్‌బీఆర్, ఎంబీఆర్, వెట్‌ల్యాండ్ ట్రీట్‌మెంట్ సాంకేతికతలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను తిలకించారు. హైదరాబాద్‌లో చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాఫ్ట్స్ సంస్థ ప్రతినిధి యూనస్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. కేవలం సాంకేతిక ప్రదర్శనకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఈ విధానాల ద్వారా మురుగునీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశాన్ని హైడ్రా బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. తక్కువ విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం, దీర్ఘకాలిక సామర్థ్యం, ప్రకృతి ఆధారిత నీటి శుద్ధి విధానాలను అధ్యయనం చేసింది. ఈ సాంకేతికత ద్వారా నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణకు కూడా గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని బిట్స్ పిలానీ గోవా క్యాంపస్ ప్రొఫెసర్లు వివరించారు. హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా పాతబస్తీలోని బమ్మృకున్‌ఉద్‌దౌలా చెరువు వద్ద ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి ఫలితాలను పరిశీలించాలని నిర్ణయించినట్లు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే నగరంలోని ఇతర చెరువుల పునరుద్ధరణలో కూడా ఇదే సాంకేతికతను అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ విధానాలు

- **రూ.21.61 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.**
- **ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన.**



ఖమ్మం, మహా : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజలకు నిజమైన భరోసా కల్పిస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో గురువారం విస్తృతంగా పర్యటించిన మంత్రి.. ఉచిత సన్నబియ్యం పంపిణీ, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, రైతులతో మమేకం, ప్రజల సమస్యలపై ఆరా వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మూడు నెలలకు సంబంధించిన ఉచిత సన్నబియ్యాన్ని రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రతి రేషన్ కార్డుదారునికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే రేషన్ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు.గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చాలామంది వినియోగించకుండా విక్రయించేవారని, ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన సన్నబియ్యాన్ని కుటుంబ సభ్యులే వినియోగిస్తున్నారని తెలిపారు. ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన బియ్యం అందుతోందని తెలిపారు. అనంతరం కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈశ్వర మాదారం-భద్రు తండా మధ్య రూ.1.76 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న మరో బీటీ రోడ్డు, చౌటుపల్లిలో రూ.3.20 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చౌటుపల్లి గ్రామాన్ని ఎంపీగా ఉన్న సమయంలో దత్తత తీసుకుని అభివృద్ధి చేశానని, ఇప్పుడు మంత్రిగా మిగిలిన పనులన్నీ పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. లింగారం తండాలో ఇప్పటికే రూ.5.45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వీధి దీపాల ఏర్పాటును వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపికను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ ఇటీవల రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశామని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, పాలేరు ప్రాంతంలో రీసర్వే నిర్వహించి అర్హులైన ప్రతి రైతుకు పట్టాదారు పాస్‌బుక్లు అందిస్తామని స్పష్టం చేశారు. లింగారం తండాలో రైతులతో కలిసి పొలంలోకి దిగి స్వయంగా ఎద్దులతో దుక్కి దున్నిన మంత్రి వ్యవసాయ పనులపై రైతులతో చర్చించారు. రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పర్యటించిన మంత్రి.. గుదిమల్ల-ప్రకాశ్ నగర్ మధ్య రూ.5 కోట్ల రహదారి, కామంచికల్-కోయచిలక మధ్య రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని డివిజన్లలో రూ.21.61 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలు, కొత్త మున్సిపాలిటీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రైతు భరోసా నిధులు జమ చేశామని మంత్రి పేర్కొన్నారు. సన్న వడ్లకు బోనస్, మద్దతు ధర అందిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి కొత్తగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను కూడా మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మరో రెండు రహదారులను మంజూరు చేయడంతో పాటు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సూచనల మేరకు అన్ని పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ గత 25 ఏళ్లలో జరగని స్థాయిలో అభివృద్ధి పనులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.75 కోట్లు మంజూరు కావడం వల్ల ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీశైలానికి ఉధృతంగా వరద.

- **2.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.**
- **జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.**

శ్రీశైలం,మహా : శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. గురువారం రాత్రి నాటికి జలాశయానికి 2,16,764 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం జలాశయం నుంచి ఎలాంటి నీటి విడుదల (ఔట్‌ఫ్లో) చేపట్టలేదు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 871.70 అడుగులుగా నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద ప్రవాహం పెరుగుతుండటంతో జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.వరద పరిస్థితిని సాగునీటి శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జలాశయ నీటి నిల్వలు, దిగువ ప్రాంతాల పరిస్థితులను సమీక్షిస్తూ అవసరాన్ని బట్టి గేట్లు ఎత్తి నీటి విడుదలపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- **సంగారెడ్డిలో సీఎం ప్రారంభం.**
- **119 నియోజకవర్గాల్లో ఒకేసారి పంపిణీ కార్యక్రమాలు.**
- **అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు.**




**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసి లామినేట్ చేసిన 1.05 కోట్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రేషన్ కార్డులను ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి రాష్ట్ర నీటిపారుదల, ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి కార్యాలయం గురువారం అధికారిక మెమో జారీ చేసింది.కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఒకేసారి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక వేడుకలు ఉదయం నిర్వహించబడనున్నందున, అలాగే సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే 'అట్ హోమ్' కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. లబ్ధిదారుల జాబితాలను తుది దశలో పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించింది. రేషన్ కార్డుల ముద్రణ, భద్రత, రవాణా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఆర్‌డీఓలు, పౌర సరఫరాల శాఖ అధికారుల మధ్య సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపిణీ కేంద్రాల్లో తాగునీరు, కూర్చునే సౌకర్యం, వేదికలు, నమోదుకు అవసరమైన ఏర్పాట్లు, ధ్రువీకరణ ప్రక్రియ, క్రమబద్ధమైన పంపిణీ కోసం తగిన సిబ్బందిని నియమించాలని సూచించింది. అలాగే కార్యక్రమానికి సంబంధించి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మీడియా సమన్వయం, విస్తృత ప్రచార చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్యక్రమం ముగిసిన అనంతరం పంపిణీ చేసిన రేషన్ కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించింది. కొత్తగా అర్హత పొందిన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను విస్తరించే దిశగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కీలక సంక్షేమ కార్యక్రమంగా పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెమోలో స్పష్టం చేసింది.

## రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు స్టే

- **డ్రోన్ సర్వేపై నిలుపుదల.. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం.**

**ఢిల్లీ, మహా :** రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై స్టే విధిస్తూ, తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం వెల్లడించింది.హైకోర్టు తమ వాదనలు వినకుండానే డ్రోన్ సర్వేకు ఆదేశాలు ఇచ్చిందని టీజీఐఐసీ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఆగస్టు 14లోగా సవరణ పిటిషన్ దాఖలు చేయాలని సూచిస్తూ గడువు విధించింది. అలాగే రాయదుర్గం సర్వే నంబర్ 83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన ప్రస్తుతం లేదని టీజీఐఐసీ తరఫు సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణ వరకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం

## హరీశ్‌రావు క్షుద్రపూజలపై వివరణ ఇవ్వాలి

- **లీగల్ నోటీసులకు భయపడేది లేదు.**
- **సీఎం రేవంత్‌తో ఎలాంటి విభేదాలు లేవు**
- **మహేష్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, మహా:** బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు క్షుద్రపూజల అంశంపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మరోసారి డిమాండ్ చేశారు. హరీశ్‌రావును వ్యక్తిగతంగా కించపరచలేదని, ఆయనపై తప్పుడు ప్రచారం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. అయితే మార్చి 2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గలోని క్షుద్రపూజలకు ప్రసిద్ధి చెందిన ఆలయాలకు ఆయన ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాలని కోరారు.గాంధీ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. తమకు మూఢ నమ్మకాలతో సంబంధం లేదని, కానీ హరీశ్‌రావు సందర్శించిన ఆలయాలు క్షుద్రపూజలకు ప్రసిద్ధి చెందినవని పేర్కొన్నారు. అందువల్ల ఆ ఆలయాలను ఏ ఉద్దేశంతో సందర్శించారో బహిరంగంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రానికి ఎవరు శని, ఎవరు దరిద్రమో ప్రజలు ఎన్నికల్లోనే తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు పంపిన లీగల్ నోటీసులకు భయపడేది లేదని, అవసరమైతే న్యాయస్థానంలోనే పోరాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశంపై వస్తున్న ప్రచారాన్నీ ఆయన ఖండించారు. ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలుపై సమన్వయం కోసం కమిటీ ఏర్పాటు చేశామని, అందరూ కలిసి చర్చిస్తే మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సమన్వయ కమిటీకి ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి వివరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాము గౌరవిస్తామని అన్నారు.
సమన్వయ కమిటీ సమావేశంలో అందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. సమావేశం రౌండ్ టేబుల్ విధానంలో జరిగిందని, టేబుల్ ఆకారం కారణంగా ఫొటోల్లో కొందరు మధ్యలో కూర్చున్నట్లు కనిపించిందని వివరణ ఇచ్చారు. సమావేశాన్ని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించారని చెప్పారు.తనపై ఆడియోలు, వీడియోలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా మహేష్ కుమార్ గౌడ్ ఖండించారు. నిజంగా అలాంటి ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో దొంగచాటుగా ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి లేదని, ఏ విషయం ఉన్నా ముఖాముఖిగానే మాట్లాడుకుంటామని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసిన ఆయన.. రోజూ సీఎంతో ఫోన్‌లో మాట్లాడుతుంటానని, నిన్న కూడా మాట్లాడానని తెలిపారు. కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం బాగానే ఉందని, తాను సీఎం నాయకత్వంలోనే పనిచేస్తున్నానని చెప్పారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలను కూడా మహేష్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. అర్వింద్, బండి సంజయ్ వ్యాఖ్యలకు విలువ లేదని విమర్శించారు. నాయకత్వానికి ఎత్తు ప్రమాణం కాదని, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి కూడా పొట్టిగా ఉన్నప్పటికీ దేశాన్ని సమర్థంగా నడిపారని గుర్తు చేస్తూ వ్యక్తిగత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

# భద్రాచలం–వాజేడు రహదారికి త్వరలో మోక్షం?

- **వారం రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కాంట్రాక్టర్ మార్పు కోరిన మంత్రి తుమ్మల.**
- **రూ.115.28 కోట్లతో 112.6 కి.మీ. రహదారి అభివృద్ధికి వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు.**



**భద్రాచలం, మహా:** భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించగా.. వెంటనే స్పందించిన ఆయన ఆంధ్రప్రదేశ్ రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఏళ్లుగా మరమ్మతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు మంత్రికి వివరించారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికి మూడు గంటల సమయం పడుతోందని, రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఆంధ్రప్రదేశ్ ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరైనా కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని మంత్రి జనార్ధన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.భద్రాచలం-వాజేడు రహదారి అభివృద్ధి పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ.67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు. సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున రూ.115.28 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు అమలు కానుంది.ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఆర్‌అండ్‌బీ ఈఈలు క్షేత్రస్థాయిలో అమలు బాధ్యతలు నిర్వహించనున్నారు.భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తారని గుర్తు చేసిన మంత్రి తుమ్మల, రహదారి దుస్థితి వల్ల భక్తులు, స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందువల్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు.





## సూర్యుడి అరుదైన చిత్రాలు విడుదల

**హైదరాబాద్, మహా.** ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సౌర టెలిస్కోప్ డానియెల్ కె. ఇనోయే సాయంతో శాస్త్రవేత్తలు సూర్యుడి ఉపరితలానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన చిత్రాలను విడుదల చేశారు. ఈ చిత్రాల్లో సూర్యుడిపై ఏర్పడే సూక్ష్మస్థాయి ప్లాస్మా సుడిగుండాలు (వోర్టెక్స్‌లు) తొలిసారిగా స్పష్టంగా నమోదయ్యాయి. కెల్విన్‌హెల్మ్‌హోల్ట్జ అస్థిరతలు గా పిలిచే ఈ దృశ్యాలు సౌర పరిశోధనలో కీలక మైలురాయిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.వేగంగా కదిలే వేడి ప్లాస్మా, నెమ్మదిగా కదిలే ప్లాస్మాతో ఢీకొన్నప్పుడు ఈ తరహా అలలు, సుడిగుండాలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియను శాస్త్రవేత్తలు ఎన్నో ఏళ్లుగా సిద్ధాంతపరంగా వివరించినప్పటికీ, సూర్యుడి ఉపరితలంపై ఇంత స్పష్టంగా వీటిని పరిశీలించడం ఇదే తొలిసారి. ఈ పరిశోధన ద్వారా సూర్యుడిలో అయస్కాంత శక్తి ఎలా పేరుకుపోతుంది, ఎలా విడుదలవుతుంది అనే అంశాలపై మరింత స్పష్టత లభించనుంది.



## రామాయణ ట్రైలర్‌కు భారీ స్పందన..

### ఏఐ అప్‌డేట్‌తో మరింత ఆకట్టుకున్న వీడియో

బాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన 'రామాయణ' విడుదలకు ముందే భారీ చర్చకు దారి తీస్తోంది. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ దేశ విదేశాల్లో సినీ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది.ట్రైలర్ విడుదలైన కొద్ది రోజుల్లోనే వివిధ డిజిటల్ వేదికలపై కలిపి భారీ స్థాయిలో వీక్షణలు నమోదు కావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ట్రైలర్‌ను విస్తృతంగా పంచుకోవడంతో ఇది అనేక వేదికల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. దీంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తి మరింత పెరిగిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం మరో ప్రత్యేక అప్‌డేట్‌ను విడుదల చేసింది. ట్రైలర్‌ను ఆధునిక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లిప్‌సింక్ సాంకేతికతతో మెరుగుపరచి మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. ఇందులో నటీనటుల పెదాల కదలికలను డబ్బింగ్ సంభాషణలకు అనుగుణంగా సవరించడం ద్వారా సహజత్వాన్ని పెంచినట్లు వెల్లడించింది. సాధారణంగా ఇతర భాషల్లోకి డబ్ చేసిన చిత్రాల్లో మాటలు, పెదాల కదలికల మధ్య తేడా కనిపించడం సహజం. అయితే ఈ సాంకేతికతతో ఆ లోపాన్ని గణనీయంగా తగ్గించగలిగారని, ఏ భాషలో చూసినా నటీనటులు అదే భాష మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తోందని పలువురు ప్రేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏఐ ఆధారిత ఈ మార్పులకు సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది. డైలాగులు మరింత సహజంగా వినిపిస్తున్నాయని, ట్రైలర్ నాణ్యత మరింత మెరుగైందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇదే స్థాయి సాంకేతిక నాణ్యత చిత్రంలోనూ కనిపిస్తే ప్రేక్షకులకు విశేషమైన అనుభూతి కలుగుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో, నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతోంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. విడుదలకు ముందే విశేష ఆదరణ పొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.





## వారణాసి సెట్ నుంచి లీకులు.. రాజమౌళి బృందానికి మరో సవాల్



రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే షూటింగ్‌కు సంబంధించి వరుసగా దృశ్యాలు బయటకు వస్తుండటం చిత్రబృందానికి ఆందోళన కలిగిస్తోంది.తాజాగా చిత్రీకరణ జరుగుతున్న ప్రదేశం నుంచి యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీటిలో మహేష్ బాబు పాల్గొన్న కీలక సన్నివేశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీడియోల నాణ్యత స్పష్టంగా లేకపోయినా, అధికారిక ప్రచారం ప్రారంభానికి ముందే దృశ్యాలు బయటకు రావడం నిర్మాతలకు ఇబ్బందిగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే పలు వేదికల నుంచి వీడియోలను తొలగించే చర్యలు చేపట్టినా, అప్పటికే అవి అభిమానుల మధ్య విస్తృతంగా వ్యాపించాయి.ఈ చిత్రం కోసం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు తెలిసింది. షూటింగ్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు తప్పనిసరి. నటీనటులు, సాంకేతిక సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. మీడియా ప్రవేశానికీ పరిమితులు విధించడంతో పాటు, చిత్రబృందంలోని సభ్యులతో గోప్యత ఒప్పందాలపై సంతకాలు చేయిస్తున్నారు. అయినప్పటికీ తరచూ దృశ్యాలు బయటకు రావడం చిత్రబృందానికి తలనొప్పిగా మారింది. అత్యాధునిక ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో ప్రియాంక చోప్రా జోనాస్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 ఏప్రిల్ 7న సినిమాను విడుదల చేయాలని ఇప్పటికే ప్రకటించారు. కథ, పాత్రల రూపకల్పన, విజువల్ ఎఫెక్ట్స్ వంటి అంశాలను గోప్యంగా ఉంచాలని భావిస్తున్న చిత్రబృందానికి ఈ వరుస లీకులు కొత్త సవాల్‌గా మారాయి.

## రాయల్ లుక్‌లో రాశి సింగ్ సందడి

నీలిరంగు శాటిన్ దుస్తుల్లో రాశి సింగ్ చేసిన తాజా ఫోటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆకర్షణీయమైన పూల డిజైన్, స్టైలిష్ డ్రేపింగ్‌తో కూడిన ఈ వస్త్రధారణలో ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంగా కెమెరాకు పోజులిచ్చింది. సహజంగా వదిలిన పొడవాటి జుట్టు, మృదువైన మేకప్, సొగసైన ఆభరణాలు ఆమె అందాన్ని మరింత మెరిపించాయి. గులాబీ రంగు నేపథ్యంపై ఆమె గ్లామరస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో జన్మించిన రాశి సింగ్ సినీ రంగంలోకి రాకముందు ఎయిర్ హోస్టెస్‌గా పనిచేశారు. అనంతరం నటనపై ఆసక్తితో చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె 2021లో ఆది సాయికుమార్ హీరోగా తెరకెక్కిన తెలుగు రొమాంటిక్ చిత్రం 'శశి' ద్వారా కథానాయికగా పరిచయమయ్యారు. ఈ చిత్రంలో 'సునీ' పాత్రలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు.ఆ తర్వాత 2023లో విడుదలైన 'ప్రేమ్ కుమార్' చిత్రంలో 'నేత్ర' పాత్రలో కనిపించిన రాశి, తన సహజ నటనతో మంచి గుర్తింపు సంపాదించారు. 2024లో వచ్చిన 'భూతద్దం భాస్కర్ నారాయణ'లో 'లక్ష్మి' పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. అదే ఏడాది విడుదలైన క్రైమ్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం'లో ఏసీపీ వైదేహిగా కనిపించి తన నటనలో మరో కోణాన్ని చూపించారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న ఆమెకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం రాశి సింగ్ పలు ఆసక్తికరమైన చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్', 'సంతాన ప్రాప్తిరస్తు' వంటి చిత్రాలతో పాటు 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', 'గాసిప్' చిత్రాల్లోనూ నటిస్తున్నారు. సినిమాలతో పాటు 'పాపం పసివాడు', '3 రోజెస్ - సీజన్ 2' వంటి వెబ్ సిరీస్‌ల్లో కూడా నటించి డిజిటల్ వేదికలపై తన ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు.నటనతో పాటు వ్యాపార రంగంలోనూ రాశి సింగ్ తన ప్రతిభను చాటుతున్నారు. ఫుడ్, కేఫే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి విజయవంతమైన యువ పారిశ్రామికవేత్తగా కూడా గుర్తింపు పొందుతున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు వ్యాపార బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఆమె ఎంపిక చేసుకుంటున్న విభిన్న కథలు, పాత్రలు భవిష్యత్తులో తెలుగు చిత్రసీమలో మరింత బలమైన స్థానం సంపాదించేందుకు దోహదపడతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## జి.డి. నాయుడు'గా మాధవన్.. మరో స్ఫూర్తిదాయక బయోపిక్‌కు సిద్ధం



వాస్తవ సంఘటనలు, గొప్ప వ్యక్తుల జీవితాలను వెండితెరపై ఆవిష్కరించడంలో నటుడు ఆర్. మాధవన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. 'రాకెట్రి: ది నంబి ఎఫెక్ట్'తో ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు భారతీయ శాస్త్ర, పారిశ్రామిక రంగంలో విశిష్ట సేవలు అందించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు జీవితకథ ఆధారంగా తెరకెక్కిన 'జి.డి. నాయుడు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, భారతదేశ సాంకేతిక అభివృద్ధికి విశేష కృషి చేసిన జి.డి. నాయుడు జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరించనుంది. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా', 'మిరాకిల్ మేన్', 'వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూర్'గా గుర్తింపు పొందిన ఆయన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఈ సినిమాలో చూపించనున్నారు.

ఈ చిత్రంలో సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, దుషారా విజయన్, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటించారు. గోవింద్ వసంత స్వరపరిచిన నేపథ్య సంగీతం చిత్రానికి మరింత బలం చేకూర్చనుంది. జి.డి. నాయుడు పాత్ర కోసం మాధవన్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతూ, విభిన్న దశల్లో కనిపించనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమైంది. ఇప్పటికే విడుదలైన తెలుగు ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కాలానుగుణ వాతావరణాన్ని ప్రతిబింబించే సెట్లు, నిర్మాణ విలువలు, మాధవన్ నటన సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. భారతీయ శాస్త్రవేత్త జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా ఆవిష్కరించే ఈ చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'జి.డి. నాయుడు' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది. శాస్త్రవేత్త, ఆవిష్కర్తగా చిరస్థాయిగా నిలిచిన జి.డి. నాయుడు జీవితగాథను కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నంగా ఈ బయోపిక్ నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నాని కొత్త అవతార్‌కు ప్రశంసలు

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తొలి చిత్రం 'దసరా'తోనే తనదైన ముద్ర వేశారు. ఆ సినిమాతో నాని కెరీర్‌లో గుర్తుండిపోయే విజయాన్ని అందించిన ఆయన, ఇప్పుడు అదే కాంబినేషన్‌లో మరింత భారీ స్థాయిలో 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, మోహన్ బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన అధికారిక ట్రైలర్ ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో నాని గత చిత్రాలకు భిన్నంగా అత్యంత పవర్‌ఫుల్, తీవ్ర భావోద్వేగాలతో కూడిన పాత్రలో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్, నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రైలర్‌లో వినిపించిన సంభాషణలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. శ్రీకాంత్ ఓదెల తన ప్రత్యేక మేకింగ్ శైలిని మరోసారి చూపించినట్లు ట్రైలర్ స్పష్టంగా తెలియజేస్తోంది. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ పరంగా కూడా భారీ అనుభూతిని అందించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ట్రైలర్ విడుదలైన తర్వాత సామాజిక మాధ్యమాల్లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో రూపొందుతున్న **'ది ప్యారడైజ్'** 2026 సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'దసరా' తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుందనే ఆశాభావం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034